హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ

- భారం కాదు.. భద్రత అంటున్న పోలీసులు
- తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్విచక్రవాహనదారులకు సూచన


బుట్టాయగూడెంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఉరుకులు, పరుగుల జీవితంలో వేగానికి ఇస్తున్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం, ఫర్వాలేదులే అనే ఉదాసీన వైఖరి ఎన్నో జీవితాలను రహదారులకు బలి చేస్తుంది. వందలాది కుటుంబాలను వీధిపాలు చేస్తుంది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. అది కూడా తలకు తీవ్రమైన గాయాలు కావడం వల్లే మరణిస్తున్నారు. తలకు హెల్మెట్ ధరిస్తే మృత్యువుని జయించవచ్చనేది ఎందరికో అనుభవమే. మృత్యువు నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రహదారి ప్రమాదాల విషయంలో ప్రాణాలు పోయే పరిస్థితులు ఉండవని వాహనదారులకు రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పదేపదే చెప్తున్నా పెడచెవిన పెట్టడం ప్రమాదాలకు దారితీస్తుందనేది నిజం.

సర్వే చెప్తున్న వాస్తవాలివి

ప్రతి ఏటా దేశవ్యాప్తంగా కార్ల ప్రమాదాల కంటే ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు 66 శాతం అధికంగా ఉన్నాయనేది సర్వేలో తేలింది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరిస్తే 44 శాతం ప్రమాదాల నుంచి ప్రాణాలను దక్కించుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.


హెల్మెట్ ధరించిన దృశ్యం

అలాగే 69 శాతం ప్రమాద సమయాల్లో తలకు గాయం కాకుండా బయటపడొచ్చని మోటార్ సైకిల్ హెల్మెట్ స్టడీ నివేదిక వెల్లడించింది. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అధికంగా ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చని అధికారులు చెప్తున్నారు.

హెల్మెట్ వల్ల ఉపయోగాలు

హెల్మెట్ వాడకం వల్ల ప్రమాదాలు జరిగినా తలకు గాయాల తీవ్రతను తగ్గిస్తాయి. ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి 98 శాతం బయటపడొచ్చు. దుమ్ము, ధూళి, ఎండ నుంచి రక్షణ పొందవచ్చు. బయటకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు తిరిగి క్షేమంగా ఇంటికి చేరేలా ఉపయోగపడుతుంది.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



హెల్మెట్ ధరించడం తలకు భారం కాదు. భద్రతకు భరోసా లాంటిది. తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల నుంచి అధిక శాతం బయటపడే అవకాశం ఉంటుంది. భారంగా భావించకుండా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలి.

– కె.వెంకన్న, ఎస్సై, బుట్టాయగూడెం

పుచ్చలపల్లి జీవితం ఆదర్శప్రాయం


చింతలపూడి: సుందరయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు


టి.నరసాపురం: సుందరయ్యకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


కుక్కునూరు: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసిన నేతలు

కుక్కునూరు: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అని సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా చీరవల్లి, మాధవరం, దాచారం, కుక్కునూరు గ్రామాల్లో సీపీఎం కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాట, రైతాంగ ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడిగానే కాకుండా, గొప్ప పార్లమెంటేరియన్‌గా 17 సంవత్సరాలు పాటు ఎమ్మెల్యేగా, ఐదేళ్లపాటు ఎంపీగా పార్లమెంట్‌లో ఉన్నారన్నారు. పార్లమెంట్‌కు, శాసనసభకు సైకిల్ మీద వెళ్లిన నిరాడంబరుడు పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఆయన్ను నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, మేడిపల్లి బాబు, కోట రామలక్ష్మి, పట్ల లక్ష్మయ్య, షేక్ వలిపాషా, పార్టీ సభ్యులు కోట మోహన్‌రావు, మహబూబ్ పాషా, ఎండీ ఫుల్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడిన నేత

జంగారెడ్డిగూడెం: పీడిత ప్రజల నేత, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి జంగారెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టిసపాలెం గ్రామంలో చింతాల చెరువు ఉపాధి హామీ పని ప్రదేశంలో జె.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం దేశవ్యాప్తంగా కూలీల హక్కులకై పోరాడిన ఘనత సుందరయ్యకే దక్కుతందుని కొనియాడారు. కార్యక్రమంలో బోడిగా అర్జునుడు. కరువుల దుర్గారావు, బోడిగ వసంతరావు. పూసం దుర్గా, కనితి చిన్న దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో కన్నాపురం రోడ్‌లోని ఎంపీపీ స్కూల్ మెయిన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య రాజకీయ జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని సీపీఎం మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు పేర్కొన్నారు. సుందరయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన జీవిత చరిత్రను ప్రాథమిక విద్య పాఠ్యాంశంగా చేర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యు.నాగమణి, సీహెచ్ మరిడయ్య, బొబ్బర మంగరాజు, ఎస్.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

చింతలపూడి: పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో పుచ్చలపల్లి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుందరయ్య అందించిన సేవలను సీఐటీయూ నాయకులు కొనియాడారు. సీపీఎం నాయకులు ఎస్ సూర్యకుమార్, జోషి, కెసు, డి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

టి.నరసాపురం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండలంలోని ఏఎస్ఆర్ నగర్‌లో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనుమోలు మురళి మాట్లాడుతూ పార్టీ కోసం, ప్రజల కోసం ఆయన యావదాస్తిని అర్పించారన్నారు. బిడ్డలు వుంటే ప్రజలకోసం పూర్తి సమయం కేటాయించలేమని బిడ్డల్ని వద్దనుకున్న త్యాగధనుడని అన్నారు. సుందరయ్య ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం


చిలుకూరి జ్ఞానారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చింతలపూడి: ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్లు ఏకపక్షంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేశారని అన్నారు. చింతలపూడి ఎమ్మెల్యేగా కంభం విజయరాజు, ఏలూరు ఎంపీగా కె.సునీల్‌కుమార్ యాదవ్‌ల విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు, అభిమానులకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దళితులపై దాడి హేయమైన చర్య


గుర్రాల రవికుమార్


కడిమి రమేష్

కామవరపుకోట: కంఠమనేనివారిగూడెంలో దళిత యువకులపై దాడి చేసిన టీడీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అకారణంగా దళిత వ్యక్తులపై దాడి చేసి, కులం పేరుతో దూషించి, హత్య ప్రయత్నం చేసిన అగ్రకులానికి చెందిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు తక్షణమే న్యాయం చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి మెరుగైన వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే బాధిత కుటుంబానికి రక్షణ అందించాలని కోరారు.

ఓటమి భయంతోనే దాడులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనతో ఆకర్షితులై పార్టీకి దగ్గరైన దళితులపై కక్ష కట్టి టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలో కండమనేనివారిగూడెంలో దళితులపై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఓటమి భయంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దమ్ముంటే సీఎం జగన్ వలె మంచి పరిపాలన అందించి ప్రజల మన్ననాలను పొందాలని, అంతేగాని ఎన్నికలలో ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి, వాటిని ప్రజలు నమ్మలేదని, ఓడిపోతామనే ఈర్ష్య భావంతో అమాయకులైన దళితులపై దాడులు నిర్వహించడం ప్రజాస్వామ్యంలో నీచమైనచర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బాధితుడు రవితేజకు మెరుగైన వైద్యం అందించేందుకు, దోషులకు శిక్షపడే విధంగా, అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

భూముల సారవంతానికి నవధాన్యాల అందజేత


ఖరీఫ్ సీజన్లో రైతులకు పంచేందుకు సిద్ధం చేసిన నవధాన్యాల బ్యాగ్‌లు

కొయ్యలగూడెం: ఖరీఫ్ సీజన్లో భూముల సారవంతానికి రైతులకు నవధాన్యాలను అందజేస్తున్నట్లు ఏడీఏ పి.బుజ్జిబాబు పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఏఎంసీ యార్డు ప్రాంగణంలో అందించేందుకు పద్దెనిమిది రకాల కలిగిన నవధాన్యాల బ్యాగులను సిద్ధం చేశామన్నారు. పీఎండీఎస్ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం తాతారావు ఆధ్వర్యంలో కేఆర్‌పురం పరిధిలోని రైతులకు వీటిని ఖరీదుకు అందజేయడం జరుగుతుందన్నారు. పదికేజీల బ్యాగ్ రూ.800కు అందిస్తున్నామని, తమ పరిధిలోని రైతులందరికి ఇది వర్తిస్తుందని తెలిపారు. గతంలో పచ్చిరొట్ట భూసార అభివృద్ధికి దోహదపడేది అని, అయితే నలభై ఐదు రోజుల వయసు ఉన్న నవధాన్యాల పంటను అదును చూసి దున్నుకోవడం వల్ల రైతులకు ఐదు టన్నుల పచ్చిరొట్ట భూసారంతో సమానం అవుతుందని అన్నారు. పప్పు జాతి, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆయిల్ సీడ్స్ తదితర రకాలను నవధాన్యాలలో మిశ్రమమై ఉంటాయన్నారు. కావలసిన రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చు అని సూచించారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం పట్టణంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక బైనేరువద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద న్యాయవాది నడకుదురు భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు జుత్తాడ వాణి, చింతపల్లి ప్రశాంతి, జైత్రా రావూరి, సీహెచ్ పూజ, డి.ప్రహర్షిత, డి.హారీష్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బుచ్చియ్యాచారి, 2వ వార్డు కౌన్సిలర్ పెసరగంటి గంగ, మాజీ ఎంపీపీ కొండపల్లి కేసుబాబు, ఎంపీటీసీ చిట్రోజు తాతాజీ, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు లకణవరపు భోగేశ్వరరావు, పి.త్రిమూర్తులు, గాళ్ళ సత్యనారాయణచారి, పట్నాల శ్రీదేవి, కర్రి విజయ్ కొండపర్తి గణేష్, జుత్తాడ గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణత్సోవాలు


పోలవరం మహానందీశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: వైశాఖమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలుచోట్ల కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా జరిపించారు. పోలవరం మండలంలోని గోదావరి నది మధ్యలో గల మహానందీశ్వర స్వామి ఆలయంలో శ్రీ పద్మావతి అలివేలుమంగా సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే బోడిగూడెం గ్రామంలో శ్రీగిరి పర్వతంపై స్వయంభుగా వెలసిన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పాత పట్టిసీమలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా స్వామివారి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తులు అత్యధిక సంఖ్యలో ఆయా దేవాలయాలకు చేరుకుని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. అనంతరం ఆలయాల వద్ద నిర్వాహకులు చేపట్టిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రంథాలయానికి జేఈఈ పుస్తకాల అందజేత

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయానికి డీఎఫ్‌వో ప్రభాకరరావు జేఈఈ పుస్తకాలు ఆదివారం అందజేశారు. సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావు ద్వారా ఈ పుస్తకాలను గ్రంథపాలకుడు గంగాధరరావుకు అందజేశారు. ఈ పుస్తకాలు జేఈఈ విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణ పనుల ప్రారంభం


మర్రిగూడెంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణం ప్రారంభించిన దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని గిరిజన గ్రామాలకు మంచి రోజులు వచ్చాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు అన్నారు. మండలంలోని మర్రిగూడెంలో రూ. 1.40 కోట్లతో మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి నిరీక్షణరావు, సర్పంచ్ సోయం బిందు ఆదివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరీక్షణరావు మాట్లాడుతూ మండలంలోని మర్రిగూడెం, చుట్టుపక్కల గ్రామాలకు ఎటువంటి సెల్ సిగ్నల్స్ లేక గత కొన్నేళ్లుగా నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడాలంటే గట్లు, డాబాలు ఎక్కాల్సిందేనని వివరించారు. గిరిజనుల కష్టాలను ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. వారి సహకారంతో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరైందని తెలిపారు. దీంతో ఆ పనులను ప్రారంభించినట్లు వివరించారు. నెలరోజుల్లో టవర్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ మండలాధ్యక్షుడు కురసం రవీంద్రబాబు, యూత్ నాయకులు పూసం సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

పోలవరం రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో కూడా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు విస్తరిస్తుందని ఆ సంస్థ పోలవరం మండల అధ్యక్షుడు గణేష్ మాస్టర్ తెలిపారు. ఆదివారం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కోయనాగంపాలెం గ్రామానికి చెందిన సవలం కన్నపు అనే వ్యక్తికి పోలవరం రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనం వద్ద మానవత సంస్థ తరపున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోసుబాబు, రివిజినల్ మేనేజర్ వాసుబోయిన చంద్రయ్య, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సిద్ధా కృష్ణమూర్తి, ఆకుల నరసింహమూర్తి, పోతుల చిరంజీవి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలు


శ్రీగోవిందమాత, వీరబ్రహ్మేంద్రస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: శ్రీగోవిందమాత సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. టి.నరసాపురంలో జరిగిన ఈ వేడుకల్లో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే అఖండ అన్నసమారాధన జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు.

చింతలపూడిలో కొవ్వొత్తుల ప్రదర్శన


కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: హెచ్ఐవి డే సందర్భంగా చింతలపూడి ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మానవత ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవి రోగులు ఆరోగ్యంగా జీవించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ కంట్రోలర్ ఎస్.అశోక్‌బాబు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, మానవత సంస్థ చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, డాక్టర్ సురేంద్ర, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు పాండు రంగారావు, పి.సోమశేఖర ఆచార్యులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో గుండె పరీక్షలు


గ్రామీణ వైద్యులతో కలిసి మాట్లాడుతున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ లక్ష్మణ్

బుట్టాయగూడెం: స్థానిక విద్యారోహిణీ డిజిటల్ స్కూల్‌లో ఆదివారం బుట్టాయగూడెం మండల గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక, ఆర్ఎంపీ, పీఎంపీలకు రాజమండ్రి పల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజీ వైద్యులు కొల్లూరి లక్ష్మణ్ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుండె నొప్పికి, గ్యాస్‌నొప్పికి మధ్య ఉన్న తేడాలను ఎలా గుర్తించాలనే అంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎస్వీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వీర్రాజు, కోశాధికారి త్రినాథ్, ఆర్ఎంపీలు, పీఎంపీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం


బుట్టాయగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన ఎండ, వేడితో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్ర సమయానికి ఒక్కసారిగా వాతావరణంలో కారుమబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో కూడా ఈ వర్షం కురిసింది. వర్షానికి జీడిమామిడి తోటలు, పొగాకు రైతులు, పుచ్చ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగూడెం ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణ ఉత్సవాలు


కల్యాణ శోభతో శ్రీరమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామివారు

కొయ్యలగూడెం: ఈనెల 18వ తేదీన ప్రారంభమైన గవరవరంలో కొలువైన శ్రీరమా సమేత వీర వెంకట సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దేవేరితో సహా స్వామి వారిని వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ, శాంతి హోమాలు జరిపించారు. సాయంత్రం నుంచి గ్రామోత్సవం, రాత్రికి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వాడపల్లి ప్రభాకర రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: దొంగతనానికి వచ్చి పట్టుబడిన వ్యక్తులను పోలీసులకు అప్పగించిన ఘటన కన్నాయిగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం పొంగుటూరు పంచాయతీ కన్నాయిగూడెం గ్రామానికి చెందిన దేవరకొండ మహేష్‌కి చెందిన మేకల మందలోని ఒక మేకను యాదవోలు గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు దొంగతనం చేస్తుండగా గ్రామస్తులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చి అప్పగించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కుక్కునూరు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఘటన ఆదివారం సాయంత్రం కుక్కునూరు మండలం కేంద్రంలోని గుండేటి వాగు వద్ద జరిగింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కుక్కునూరు దాచారం మధ్యగల గుండేటి వాగులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.11 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు: వంగూరు గ్రామానికి చెందిన పోతురాజు ప్రసాదరావు తమిళనాడులోని నాగపట్నం జిల్లా ప్రముఖ క్రైస్తవ దేవాలయం వేళంకిణి మాత చర్చిలో ఆదివారం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటంతో మోకాళ్లపై నడిచి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఆయన భార్య సామ్రాజ్యం, కుమారుడు ప్రశాంత్, కుతూరు మహిమతో వేళంకిణి మాత దేవాలయంలో వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు చేశారు. వేళంగిణి మాత దేవాలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేశామని వైఎస్ జగన్ వీరాభిమాని ప్రసాదరావు తెలిపారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు

పెదపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని పెదపాడు ఎస్సై శుభశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు 144 సెక్షన్‌తోపాటు పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండరాదని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు నాయకులు గుర్తుపెట్టుకోవాలని సూచించారు.